క్లుప్తంగా

కోలుకుంటున్న విద్యార్థిని



విద్యార్థిని రిపోర్ట్‌ను పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న ఏకలవ్య పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థిని కుర్లా హేమలత ఆరోగ్యం మెరుగుపడి కోలుకుంటుందని వైద్యులు తెలిపారు. యోగాకు ఆలస్యంగా వచ్చిందని టీచర్ గుంజీళ్లు తీయించడంతో అస్వస్థతకు గురై స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న విషయం పాఠకులకు విదితమే. టైఫాయిడ్, మలేరియాతో బాధపడుతున్న హేమలతను సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు కలిసి ఆమె ఆరోగ్యస్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది బాలాజీ, స్థానిక ల్యాబ్ టెక్నీషియన్ బొల్లపో శారా, తదితరులు పాల్గొన్నారు.

అసెస్‌మెంట్ల ఆన్‌లైన్ పూర్తి



ఈవోపీఆర్‌డీ రత్నకుమార్

లింగపాలెం: పంచాయతీరాజ్ కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లింగపాలెం మండలంలో 22 గ్రామపంచాయతీల అసెస్‌మెంట్ ట్యాక్స్, నాన్ అసెస్‌మెంట్ ట్యాక్స్ వివరాలు స్వర్ణ పంచాయతీ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేశామని ఈవోపీఆర్డీ రత్నకుమార్ తెలిపారు. లింగపాలెం మండలంలో ఉన్న 13558 అసెస్‌మెంట్లను ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు అందరినీ సమన్వయం చేసుకుంటూ హౌస్‌ట్యాక్స్ డేటా ఎంట్రీని ఆన్‌లైన్ ప్రక్రియలో నూరుశాతం పూర్తి చేశామన్నారు. ఈ మేరకు నూజివీడు డివిజన్‌లో లింగపాలెం మండలం ద్వితీయ స్థానంలో రావడం ఉందని తెలిపారు.

సీసీ రోడ్లకు వాటరింగ్ చేయాలి



కన్నాపురంలో నిర్మించిన సీసీ రోడ్డు

కొయ్యలగూడెం: కన్నాపురం పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లకు వాటరింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ పరిధిలోని మహదేవపుర, గొల్లగూడెం, కన్నాపురం, బుట్టాయిగూడెంలో నిర్మించిన రోడ్లకు వాటరింగ్ సరిగా చేయలేదు. దీంతో కొన్నిచోట్ల రోడ్డు మార్జిన్లకు పెచ్చులు ఊడిపోవడంతో పాటు పగుళ్లు వ్యాపిస్తున్నాయని ప్రజలు పేర్కొన్నారు. అదే విధంగా వేసిన సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల జంతువులు రోడ్లపై నడిచాయన్నారు. దీని వల్ల రోడ్డు కళావిహీనంగా మారిందన్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ సురేష్ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హానికారక కెమికల్స్ తరలిస్తున్న వ్యక్తులపై కేసు

భీమడోలు: హానికారక కెమికల్స్ తయారీ చేసి అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై గురువారం రాత్రి భీమడోలు పోలీసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన ముదునూరి సత్యనారాయణరాజు అనే వ్యక్తి భీమడోలు మండలం అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని కొండ్రెడ్డి నగర్ శివారున లైసెన్స్ లేకుండా పాతటైర్ల నుంచి ఆయిల్ తీసి, దానిని అదే గ్రామానికి చెందిన దంపనబోయిన ఆంజనేయులు ద్వారా హైదరాబాద్‌లోని కృష్ణ అనే వ్యక్తికి సరఫరా చేస్తున్నారు. మెడికల్ వేస్ట్ లిక్విడ్‌లో కలిపి కలిసి ఆయల్‌ను తీసి వాతావరణాన్ని కలుషితం చేస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగేలా అక్రమంగా వ్యాపారం చేస్తున్నాడు. హానికరమైన కెమికల్స్‌ను తయారు చేస్తున్న వారిపై భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. గురువారం పిప్పర సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రజలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రియాంక మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష, గర్భాశయ, రొమ్ము, నోటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- గాయాలపాలవుతున్న ప్రజలు
- రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు

కామవరపుకోట: మండలంలో పలు గ్రామాల్లో రోజురోజుకూ గ్రామ సింహాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి పగలు అనే తేడా లేకుండా గుంపులు గుంపులుగా స్వైర విహారం చేయడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామంలో సుమారు 50 నుంచి 150 వరకు వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. ఈ కుక్కలు గుంపులుగా వీధుల వెంబడి, ప్రధాన రహదారుల వెంబడి తిరుగుతూ పిల్లలు కనిపిస్తే వెంటాడి కరుస్తున్నాయి. రహదారుల అడ్డంగా గుంపులుగా రావడం, ద్విచక్ర వాహనదారులను వెంబడించడంతో ప్రమాదాలు జరిగిన సందర్భాలు చాలా ఉన్నాయి. తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లేవారు, పొలం వెళ్లే వ్యవసాయ రైతులు చేతిలో కర్ర లేనిదే బయటికి వచ్చే పరిస్థితి కనపడటం లేదు. కుక్కలు కనబడితే జనం పరుగులు తీయవలసిన పరిస్థితి ఏర్పడింది. కుక్కలతో రాత్రి వేళల్లో సమస్య చాలా తీవ్రంగా ఉందని, కొన్ని గ్రామాల్లో కుక్కల వింత అరుపులతో నిద్ర పట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల స్థానిక కొత్తూరు గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఆరుగురిని కరవడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో నాలుగు సంవత్సరాల బాలుడిని పిచ్చి కుక్క తీవ్రంగా గాయపరచటంతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి తీసుకొచ్చారు. కొన్ని గ్రామాల్లో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల వంటి మూగజీవాలు ఈ కుక్కల దాడిలో మృత్యువాత పడటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. గడచిన ఆరు నెలల్లో మండలంలో 361 మందిని కుక్కలు కరిచినట్లు, వీరిలో 90 మంది విద్యార్థులు ఉన్నట్లు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లెక్కలు తెలుపుతున్నాయి. అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది కలిగించే వీధి కుక్కలను అరికట్టేలా చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు



పిచ్చికుక్క దాడిలో తీవ్ర గాయాలైన బాలుడు (ఫైల్)

అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు



గ్రామాల్లో వీధి కుక్కల బెడద గురించి ఫిర్యాదులు అందాయి. త్వరలో ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి ప్రతి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ద్వారా వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయించడంతోపాటు, రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించి కుక్కలను ఊరు బయటకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

ముళ్లగిరి సరళకుమారి, ఎంపీడీఓ, కామవరపుకోట మండలం

బయటకు రావాలంటే హడల్



వీధి కుక్కల దాడిలో చాలా మంది గాయపడ్డారు. రాత్రి, పగలు తేడా లేకుండా వీధుల వెంబడి గుంపులు గుంపులుగా తిరుగుతూ జనం కనపడితే వెంబడించి కరుస్తున్నాయి. బయటకు రావాలంటే కుక్కలతో భయమేస్తుంది. పాఠశాలకు వెళ్లే పిల్లలు వాటిని చూసి భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలి.

ఈదర ఆంజనేయరాజు, గ్రామస్తుడు కొత్తూరు గ్రామం

ఆర్థికంగా నష్టపోతున్నాం



రాత్రి సమయంలో పొలంలోని కోళ్ల ఫారాల్లో చొరబడి వాటిని చంపేయటంతోపాటు గొర్రెలు, మేకలు, లేగ దూడలపై దాడి చేసి చంపేస్తున్నాయి. పంట పొలాల్లో గుంతలు తవ్వి పంటను నాశనం చేస్తున్నాయి. వీటి వలన ఆర్థికంగా నష్టపోతున్నాం.

మానికల సత్యనారాయణ, రైతు వల్లపల్లి గ్రామం

ఆత్మీయ కలయిక



వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన కె.విజయరాజు, నాయకులు

లింగపాలెం/చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని మరింత పటిష్ట పరిచేందుకు నాయకులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారని నియోజవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు తెలిపారు. తాడేపల్లిలో పార్టీ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గ కన్వీనర్ కె.విజయరాజు, లింగపాలెం మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నపనేని శాంతారావు, రావి కొండయ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని వీరికి సూచించారు. త్వరలో ప్రజల సమస్యలపై పార్టీ తరఫున పోరాటాలు చేస్తామని నాయకులు సన్నద్ధం కావాలన్నారు. జనవరి నుంచి తాను కూడా ప్రజల్లోకి వచ్చి కార్యకర్తలు, నాయకులు, ప్రజల సమస్యలు తెలుసుకుంటానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారని విజయరాజు తెలిపారు. అధినేతను కలిసినవారిలో వైఎస్సార్‌సీపీ చింతలపూడి మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి, తదితరులు ఉన్నారు.

నేత్రపర్వంగా ధ్వజారోహణం



ఆలయంలో అంకురార్పణ నిర్వహిస్తున్న పండితులు, అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన శ్రీవల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో జరిగే కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని గురువారం రాత్రి ఆలయంలో ధ్వజారోహణ వేడుక నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు, పండితులు గర్భాలయంలో కొలువైన స్వామి వారికి విశేష అభిషేకాలను నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి పండితులు, అర్చకులు గణపతి పూజ, పుణ్యహవాచనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపనను నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ధ్వజారోహణ వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం నిత్యోపాసన, బలిహరణ, హోమాది కార్యక్రమాలను నిర్వహించారు.

అనధికార బ్యారన్లు నిర్మిస్తే కఠిన చర్యలు



పొగాకు పంటను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

బుట్టాయగూడెం: పొగాకు రైతులు అనధికార బ్యారన్లు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1 ఆక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీహరి అన్నారు. మండలంలోని ముప్పినవారిగూడెం, మెట్టగూడెం, కోటనాగవరం, తదితర గ్రామాల్లో పొగాకు బోర్డు అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పొగాకు పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు సొంత స్థలాల్లో బ్యారన్లు నిర్మించుకోవాలన్నారు. ఈ ఏడాది బ్రెజిల్, జింబాబ్వే, తదితర దేశాల్లో పొగాకు పంట అధికంగా పండుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత రైతులు నాణ్యమైన పొగాకును పండించడంతో పాటు బోర్డు నిర్దేశించిన ప్రకారం పంటలు వేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బోర్డు అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేలలు ప్రకృతి సమతుల్యతను కాపాడుతాయి



జంగారెడ్డిగూడెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు



కొయ్యలగూడెం: మాట్లాడుతున్న ఏడీఏ బుజ్జి బాబు

జంగారెడ్డిగూడెం: నేలలు ప్రకృతి సమతుల్యతను కాపాడుతాయని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అన్నారు. గురువారం కళాశాలలో ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. కళాశాల ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ ఎం.మధు, అధ్యాపకులు సీహెచ్ భద్రినారాయణ, టీవీ రాంబాబు, టి.ఝాన్సీరాణి మాట్లాడుతూ మట్టి నీటిని శుద్ధి చేస్తూ జీవ వైవిధ్యానికి ఆవాసంగా ఉంటుందని తెలిపారు. మట్టి వాతావరణంలోని కార్బన్‌ను నిల్వ చేస్తుంది అని గ్లోబల్ వార్మింగ్ తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు ఆర్.విజయ దీపిక, జె.రాజశ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుడమికి పూజా దినోత్సవం

కొయ్యలగూడెం: ప్రపంచ నేల దినోత్సవ కార్యక్రమం కొయ్యలగూడెం లోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మితిమీరిన పెస్టిసైడ్స్ వినియోగం వల్ల నేలతల్లి సత్తువను కోల్పోయి చేటు కలుగుతుందన్నారు. సేంద్రియ ఎరువులను వాడి నేలతల్లిని సంరక్షించుకోవాలని తెలిపారు. ఏరువాక కేంద్ర శాస్త్రవేత డాక్టర్ ఫణి కుమార్ పలు పంటలకు పోషక యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. హబ్ మేనేజర్ బి.సోమశేఖర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లలిత సుధ, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



చింతలపూడి: ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉపాధ్యాయుడు



కొయ్యలగూడెం: జూనియర్ కళాశాలలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో



ద్వారకాతిరుమల: ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయుడు

జంగారెడ్డిగూడెం: రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం పటిష్ట బందోబస్తు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో 1074 మంది ఓటర్లకు గాను 994 మంది ఓటర్లు ఓటును వినియోగించుకున్నారు. డివిజన్ వ్యాప్తంగా పోలింగ్ శాతం 92.55 నమోదైనట్లు జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్‌ను నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. డీఎస్పీ యు.రవిచంద్ర జంగారెడ్డిగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్‌ను పర్యవేక్షించారు. తహసీల్దార్ కె.స్లీవజోజి, సీఐ కృష్ణబాబు, ఎస్సై షేక్ జబీర్ ఉన్నారు.

చింతలపూడి: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు చింతలపూడిలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 232 మంది ఓటర్లకు గాను పోలింగ్ ముగిసే సమయానికి 215 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సీఐ రవీంద్ర నాయక్ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొయ్యలగూడెం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 95 శాతం పోలింగ్ నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్నికలు నిర్వహించగా 113 మంది ఓటర్లకుగాను 107 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో ఎంవీ రమణ సందర్శించారు. తహసీల్దార్ కుంజా చెల్లన్న దొర, ఎస్సై చంద్రశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలవరం రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పోలవరంలో ప్రశాంతంగా ముగిశాయి. పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ సురేష్‌బాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, తహసీల్దార్ ఆర్ఎస్‌రాజు పరిశీలించారు.

ద్వారకాతిరుమల: స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 69 మంది ఉపాధ్యాయులకు గాను, 63 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 91 శాతం పోలింగ్ జరిగినట్టు అధికారులు ప్రకటించారు.

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా నిర్వహించారు. బుట్టాయగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 339 మంది ఓటర్లు ఉండగా 302 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 89.09 శాతం ఓట్ల శాతం నమోదైనట్లు పోలింగ్ అధికారులు తెలిపారు.

కుక్కునూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కుక్కునూరు మండలంలోని ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును గురువారం వినియోగించుకున్నారు. హైస్కూల్లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



జంగారెడ్డిగూడెం: పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన డీఎస్పీ యు.రవిచంద్ర, పోలీస్ అధికారులు



పోలవరం రూరల్: పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



కుక్కునూరు: పోలింగ్ బూత్ వద్ద విధుల్లో సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: ఈ నెల 6వ తేదీ జంగారెడ్డిగూడెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఈఈ (ఆపరేషన్స్) పీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుకునూరు, వేలేరుపాడు, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల పరిధిలో గ్రామాలకు ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కొయ్యలగూడెం: రెవెన్యూ సదస్సులు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ మణిదివ్య తెలిపారు. 6న తేదీ మహదేవపురం, 10న కన్నాపురం, 12న మంగపతిదేవిపేట, 13న కుంతలగూడెం, 17న దిప్పకాయలపాడు, 19న వేదాంతపురం, 20న రామానుజపురం, 21న బయ్యన్నగూడెం, 24న కన్నాయిగూడెం, 27న చొప్పరామన్నగూడెం, 28న పొంగుటూరు, 30న గవరవరం, 31న ఏడు వాడలపాలెం, 2025 సంవత్సరం జనవరి 2న కనకాద్రిపురం (ఆరిపాటి), 4న యర్రంపేట, 7న రాజవరం, 8న పరింపూడి గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహిస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సదస్సులు నిర్వహిస్తామని రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని సింగారంపాడు సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం వద్ద గురువారం జాతీయ ఆదివాసీ పాస్టర్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జాతీయ ఆదివాసీ పాస్టర్ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు కుర్సం నిరీక్షణరావు, బిషప్ యోహాను, ఉయికే కన్నయ్య ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కరాటం సాయి బాబా, పాస్టర్లు పాల్గొన్నారు.

రేషన్ అక్రమార్కులపై చర్యలు చేపట్టాలి

కొయ్యలగూడెం: రేషన్ బియ్యంతో యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్న అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని రాష్ట్ర కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ డీలర్లు మొదలుకొని వ్యాపారుల వరకు ప్రతి ఒక్కరిపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలన్నారు. పేదలకు కేటాయించే బియ్యానికి బదులు నగదును వారి అకౌంట్లోనే జమ చేసే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు.

8న సూర్యఘర్ యోజనపై అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 8వ తేదీన జంగారెడ్డిగూడెం పట్టణం, చుట్టుపక్క గ్రామాల గృహ విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం స్థానిక అశ్వారావుపేట రోడ్డు నందు గల శ్రీఆలపాటి గంగా భవాని కల్యాణ మండపం నందు పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ ఈఈ(ఆపరేషన్స్) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1180 రిజిస్ట్రేషన్ ప్రక్రియతో పథకం ప్రారంభమవుతుందని, గరిష్ఠ సబ్సిడీ రూ.78,000 లభిస్తుందన్నారు. గృహ వినియోగదారులు సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.